

మహిళా సిబ్బందికి రక్షణ లేకుంటే ఉద్యోగాలు చేయలేం

మహిళా సిబ్బందికి పని చేసే ప్రాంతంలో సరైన రక్షణ లేకుంటే ఉద్యోగాలు చేయలేని పరిస్థితి. మహిళలకు ఉద్యోగాలు చేయాలంటే ప్రభుత్వం ప్రత్యేకంగా రక్షణ అవసరాలు కల్పించాలి. కనీసం పని ప్రాంతంలో గట్టి పోలీసు రక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలి. మహిళలకు మహిళా ఉద్యోగులు అవసరం కచ్చితంగా ఉంటుంది.

– సీహెచ్ నాగుల కోటేశ్వరి, ఏఎన్ఎం, పెదగంజాం





మహిళా ఉద్యోగులకు గౌరవం ఇవ్వాలి

సమాజంలో మహిళా ఉద్యోగులకు తప్పనిసరిగా గౌరవం ఇవ్వాలి. ఎందుకంటే మహిళలు గృహిణిగా ఇంటి పనులు నిర్వహించడమే కాకుండా ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ రెండు పనులు సమర్థవంతంగా నిర్వహిస్తుంది. అటువంటి పరిస్థితుల్లో మహిళా ఉద్యోగులను గౌరవించాల్సి ఉంది.

– కట్టా ప్రసూన, స్టాఫ్ నర్స్, చినగంజాం పీహెచ్‌సీ

క్లుప్తంగా

నేడు ఆలయ ప్రతిష్ఠ

మార్టూరు: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో సోమవారం శ్రీకృష్ణ ఆలయ, విగ్రహ.. విమాన కలశ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిష్ఠ కార్యక్రమానికి పరిసర గ్రామాల ప్రజలు హాజరై అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి కుట్టు శిక్షణ

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో నేటి నుంచి 45 రోజులపాటు మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్టూరు ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక కొణిదెన రోడ్డులో గల అమ్మ ఆశ్రమంలో సోమవారం ఉదయం కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్నామని మార్టూరు పరిసర గ్రామాల మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వివరాల కోసం అమ్మ ఆశ్రమ నిర్వాహకుడు గుంటుపల్లి చందును 9391620850 నంబరును సంప్రదించాలని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు షేక్ హబీజాన్ తెలిపారు.

నేడు పర్చూరులో వేషధారణ పోటీలు

పర్చూరు (చినగంజాం): మండల కేంద్రమైన పర్చూరు వేణుగోపాల స్వామి ఆలయంలో కృష్ణాష్టమి పురస్కరించుకొని సోమవారం ఆలయ ప్రాంగణంలో బాలికలచే దేవత వేషధారణ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రావువారి వెంకట శివప్రసాద్ తెలిపారు. బాలబాలికలతో ఉట్టి కొట్టించడం, దేవత వేషధారణలు, కూచిపూడి, భరత నాట్యం ప్రదర్శనలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ప్రదర్శనల అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

నేడు టోల్ ప్లాజా వద్ద ధర్నా

మార్టూరు: జాతీయ రహదారిపై గల బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద సోమవారం సిబ్బంది ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ మండల నాయకుడు బత్తుల హనుమంతరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేతనాల పెంపుదల కోసం గత నెల రోజులుగా డిమాండ్ చేస్తున్న సిబ్బందికి యాజమాన్యం వేతనాలు పెంచకపోగా సిబ్బందిలో కొంతమందిని ఇతర రాష్ట్రాలకు బదిలీపై పంపుతూ వేధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ఈ సందర్భంగా నేడు ధర్నా చేయనున్నట్లు హనుమంతరావు తెలిపారు.

అద్దంకి 108 వాహనానికి ఫేక్ కాల్స్

అద్దంకి రూరల్: అద్దంకి 108 వాహనానికి ఆకతాయిలు ఫేక్ కాల్ చేసి వేధిస్తున్నారని వాహన ఈఎంటీ హరిబాబు ఆదివారం తెలిపారు. గత పదిరోజుల నుంచి ఇలా జరుగుతోందన్నారు. 108 వాహనానికి ఫోన్ చేసి అద్దంకి మండలంలోని ధర్మవరం గ్రామ సమీపంలో ప్రమాదం జరిగిందని చెప్పడంతో అక్కడకు వెళ్లి చూడక ఎవరూ లేకపోవడం, ఫోన్ చేసిన నంబర్‌కు ఫోన్ చేస్తే ఫోన్ ఎత్తకపోవడం జరుగుతోందని వివరించారు. కాలర్ ఐడీలో ఫోన్ చేసిన నంబర్ 8074994848ను చూడగా రాఖీ ధూళిపాళ్ల అని వస్తుందని తెలిపారు. ఈ విషయాన్ని ఎస్సై దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఇటువంటి ఫోన్ కాల్స్ వల్ల నిజంగా అత్యవసర పరిస్థితుల్లో ఉన్నవారికి అంబులెన్స్ దొరకడంలేదని తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న బీవీ సాగర్

అద్దంకి రూరల్: హెచ్ఐవీ బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, మేదరమెట్ల టీఐ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ అన్నారు. ఆదివారం స్థానిక పసుమర్తిపాలెంలోని జేసీఎం హాలులో బాపట్ల జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి హెల్ప్ టీఐ ఆధ్వర్యంలో మీకు తెలుసా ఐఈసీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ ఎయిడ్స్ పట్ల ప్రజల్లో అపోహలు, అనుమానాలు తొలగించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాధితుల పట్ల వివక్ష చూపించకూడదని చెప్పారు. 2030 నాటికి భారత దేశంలో ఎయిడ్స్ నిర్మూలన లక్ష్యంగా పని చేయాలన్నారు. ఓఆర్‌డబ్ల్యూ కరుణ, గ్రావణి, పీఈలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మేదరమెట్ల: స్కూటీ స్కిడ్ అవడంతో ఒకరికి రక్త గాయాలు అయిన సంఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల వై. జంక్షన్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు.. గుంటూరు వైపు నుంచి ఒంగోలు వైపునకు భుజంగా రెడ్డి అనే వ్యక్తి స్కూటీపై వెళుతూ మేదరమెట్ల వై. జంక్షన్ వద్ద స్కూటీ అదుపు తప్పి బోల్తా పడటంతో భుజంగా రెడ్డికి రక్త గాయాలయ్యాయి. 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి కల్లంవారిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. మద్యం మత్తు కారణంగా ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

పరీక్షలు ఫుల్!

- ఇకపై ఆరు రోజుల పాటు నిర్వహణ
- సెల్ఫ్ అసెస్‌మెంట్‌గా పేరు మార్పు
- ఈనెల 27 నుంచి పరీక్షలు ప్రారంభం

చీరాల అర్బన్:

విద్యా సామర్థ్యం అంచనా వేసేందుకు నిర్వహించే యూనిట్ పరీక్షల పేరును సెల్ఫ్ అసెస్‌మెంట్ (స్వీయ మూల్యాంకనం)గా పేరు మార్చుతూ పాఠశాల విద్యా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అలానే మూడు రోజుల్లో నిర్వహించే పరీక్షలను ఆరు రోజులు పాటు నిర్వహించేలా చర్యలు తీసుకుంది.



పరీక్షకు సిద్ధంగా ఉన్న విద్యార్థులు (ఫైల్)

వివరాల్లోకి వెళితే...

పాఠశాలల్లో నిర్వహించే యూనిట్ పరీక్షలను పేరు మార్చారు. యూనిట్ పరీక్షలను సెల్ఫ్ అసెస్‌మెంట్‌గా నిర్వహించనున్నారు. విద్యా సామర్థ్యం అంచనా వేసేందుకు ఈ పరీక్షలను నిర్వహిస్తున్నారు. అలానే గతంలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (నిర్మాణాత్మక మూల్యాంకనం) పేరుతో మూడు రోజులు నిర్వహించే వారు. తాజాగా పరీక్షల షెడ్యూల్ ప్రకారం ఆరు రోజులు పరీక్షలు నిర్వహిస్తారు. స్వీయ మూల్యాంకనం-1 పరీక్షలను ఈనెల 27 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రైవేటు మినహా అన్ని ప్రభుత్వ అనుబంధ పాఠశాలలకు జిల్లా ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ ద్వారా పరీక్ష పేపర్లను సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. చీరాల మండలంలో ప్రాథమిక పాఠశాలలు 55, ప్రాథమికోన్నత పాఠశాలలు 5, ఉన్నత పాఠశాలలు 15 ఉన్నాయి. వీటిలో మొత్తం 8111 మంది విద్యార్థులు చదువుతున్నారు.

20 మార్కులకు పరీక్ష

ఇప్పటి వరకు యూనిట్ పరీక్షల స్థానంలో నిర్వహించే ఫార్మేటివ్ పరీక్షలు 20 మార్కులకు మాత్రమే ఉండడంతో ఉదయం, మధ్యాహ్నం కలిపి రెండేసి పరీక్షలు చొప్పున నిర్వహించి మూడు రోజుల్లో పూర్తి చేసేవారు. తాజా మార్గదర్శకాల ప్రకారం సబ్జెక్టుకు ఒక రోజు చొప్పున ఆరు రోజులు పాటు నిర్వహించనున్నారు. దీని వల్ల సిలబస్‌పై ప్రభావం చూపుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. నెలవారీ సిలబస్‌లో మూడు రోజులు కుదించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఈనెల 27 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ప్రాథమిక తరగతులకు ఉదయం 10.45 నుంచి 11.45 వరకు పరీక్ష నిర్వహిస్తారు. 28న తెలుగు, 30న ఇంగ్లిషు, 31న గణితం, సెప్టెంబర్ 2న పరిసరాల విజ్ఞానం పరీక్షలుంటాయి. ఉన్నత తరగతులకు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.30 గంటల వరకు నిర్వహించనున్నారు. 27న ఓఎస్ఎస్‌సీ, 28న తెలుగు, 30న హిందీ, 31న ఇంగ్లిషు, 2న గణితం, 3న జనరల్ సైన్స్, 4న సోషల్ సబ్జెక్టులపై పరీక్షలు నిర్వహించనున్నారు.

డీసీఈబీ నుంచి ప్రశ్నపత్రాల సరఫరా



నిర్మాణాత్మక మూల్యాంకనం పేరును స్వీయ మూల్యాంకనంగా మార్చి ఈనెల 27 నుంచి నిర్వహించేలా ఏర్పాట్లు చేశాం. డీసీఈబీ ముద్రించిన ప్రశ్నపత్రాలు ఆయా పాఠశాలలకు అందేలా చర్యలు తీసుకుంటాం. 3 నుంచి 8 తరగతుల వరకు సీబీఏ విధానంలో ఓఎంఆర్ షీట్స్‌పై పరీక్షలు జరుగుతాయి.

– పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎంఈఓ-1, చీరాల



శతావధానంలో పాల్గొన్న కవులు

ఉల్లాసంగా శతావధానం

అద్దంకి రూరల్: తెలుగువారికి చెందిన అవధాన కళకు, పద్య విద్యకు దిట్టమైన పట్టుకొమ్మలుగా నిలిచి తెలుగు వారసత్వానికి వైభవం అందించినారు. కొప్పరపు సోదర కవులని డీవీఎం సత్యనారాయణ అన్నారు. ఆదివారం అద్దంకి సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో పుట్టంరాజు బుల్లెమ్మ, రామలక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్ట్ పక్షాన చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవాసదన్‌లో శతావధానం రెండో రోజు నిర్వహించారు. ఈ సభకు యం. కృష్ణకిషోర్ అధ్యక్షత వహించారు. పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ కొప్పరపు కవులు ఆశుకవితా రంగంలో అగ్రేసురులుగా విరాజిల్లారన్నారు. రెండో రోజు పృచ్ఛకులు అడిగిన శతావధానానికి సంబంధించిన సమస్య దత్తపది, వర్ణన, ఆశువులకు చమత్కార భరితంగా శతావధాని నారాయణం బాల సుబ్రమణ్యం పూరించారు. తదుపరి పృచ్ఛకులను ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి సన్మానించారు. వారణాసి రఘురామ శర్మ, యు. దేవపాలన, ఆర్వీ రాఘవరావు, చుండూరి మురళీ సుధాకరరావు, అడుసుమల్లి అనంత కోటేశ్వరరావు, జమ్మలమడక హనుమంతరావు, చప్పిడి వీరయ్య, లక్కరాజు శ్రీనివాసరావు, నిమ్మరాజు నాగేశ్వరరావు, కేవీ పోలిరెడ్డి, గాడేపల్లి దివాకరదత్తు, పాలపర్తి జ్యోతిష్మతి, సింహాద్రి జ్యోతిర్మయి, మానేపల్లి నాగకుమార శర్మ, ఇలపావులూరి శేష శ్రీధర్, కుందుర్తి ప్రసన్నాంజనేయులు, దుర్భా కొండిన్య, ధేనువుకొండ సుబ్బారావు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



లబ్ధిదారులను సర్టిఫికెట్లు శాలువాలతో సన్మానించిన దృశ్యం

మేదరమెట్ల: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రతి మహిళా ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అన్నారు. ప్రధాన మంత్రి ఆదేశాను సారం మండల వెలుగు కార్యాలయంలో ఆదివారం లక్‌పతి దీదీ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని తద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. మహిళలు చిన్న తనం నుంచే ఆర్థికంగా ఎలా ఎదగాలో తెలుసుకొని జీవించడం వలన సమాజంలో స్త్రీ ముందుకు పోతుందని జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటరమణ పేర్కొన్నారు. లక్‌పతి సీఆర్‌పీలకు సర్టిఫికెట్లు అందచేయడంతో పాటు శాలువాలతో సత్కరించారు. ఏపీఎం అనూరాధ, వెలుగు కార్యాలయం సభ్యులు పాల్గొన్నారు.

చినగంజాం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లఖపతి యోజన పథకం ద్వారా మహిళలు సంపన్నులు కావాలని వెలుగు ఏపీఎం అంజిబాబు అన్నారు. ఆదివారం స్థానిక వెలుగు కార్యాలయంలో లఖపతి దీదీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఉత్తమ క్రీడాకారునిగా సెయింట్ ఆన్స్ విద్యార్థి



ఎంపికైన విద్యార్థితో కళాశాల యాజమాన్యం

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థికి జేఎన్‌టీయూ కె. యూనివర్సిటీ ఉత్తమ క్రీడాకారుడు అవార్డు అందజేసినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, సెక్రటరీ ఎస్. లక్ష్మణరావు సంయుక్త ప్రకటనలో ఆదివారం తెలిపారు. ఇటీవల కాకినాడ జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీ ఫార్మేషన్‌డే సందర్భంగా ఈ అవార్డును కళాశాలలో ఎంబీఏ చదువుతున్న విద్యార్థి సయ్యద్ ఖాజావలికి ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ కె. జగదీశ్ బాబు తెలిపారు. ఈ విద్యార్థి ఇటీవల పంజాబ్‌లోని పాటియాలాలో జరిగిన జాతీయ జూనియర్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొని వివిధ విభాగాల్లో రెండు బంగారు, రెండు వెండి పతకాలు సాధించాడు. అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు దేశం తరఫున యూరప్‌లో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థికి ఉత్తమ క్రీడాకారుడు అవార్డు ప్రకటించారు. విద్యార్థినికి వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు, ఎంబీఏ విభాగాధిపతి ఆర్. ఇమ్మానియేల్, సి. సుబ్బారావు, డైరెక్టర్ సి. సుబ్బారావు, వివిధ విభాగాధిపతులు అభినందించారు.

చల్లగా చూడమ్మా.. గంగమ్మ తల్లీ!



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



అమ్మవారికి సారె తీసుకొస్తున్న భక్తులు

కారంచేడు: గ్రామ దేవతగా విరాజిల్లుతున్న పోలేరమ్మ తల్లి కొలుపులను ఆదివారం ఉదయం నుంచి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి తలంట్లు దగ్గర నుంచి మధ్యాహ్నం అమ్మవారికి పొంగళ్ళు, నైవేద్యాల సమర్పణను కన్నుల పండువగా నిర్వహించారు. రాత్రికి గ్రామంలోని గోడమూల బజారుకు చెందిన రైతన్నల బిడ్డలు, యువతీ, యువకులు పెద్ద ఎత్తున జాతరలో చిందులేశారు. అమ్మవారికి వీరతాళ్లతో నృత్యాలు చేశారు. బాణ సంచా కాలుస్తూ, కనక తప్పెట్లతో గ్రామంలోని అన్ని ప్రధాన వీదుల్లో అమ్మవారి చిత్రపటంతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగించారు. పోలేరమ్మతో పాటు గంగమ్మతల్లికి కూడా గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు ఈ కొలుపులు నిర్వహిస్తే ఈ ఏడాది వర్షాలు బాగా పడతాయని, పంట కాలువలు సాగు నీళ్ళతో కళకళలాడాలని, పంటలు బాగా పండాలని కోరారు.

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చీరాల రూరల్: ఇంటర్ మీడియెట్ కమిషనర్ ఉత్తర్వులను అనుసరించి బాపట్ల జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో అతిథి అధ్యాపకులుగా పనిచే సేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బాపట్ల జిల్లా ఇంటర్ విద్యా శాఖాధికారి (డీఐఈఓ) పి. యర్రయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులకు తక్కువ కాకుండా ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు రెండు సెట్ల నకలు పత్రాలు, పాస్‌పోర్టు ఫొటోలతో ఈనెల 27వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు బాపట్ల జిల్లాలోని డీఐఈఓ కార్యాలయంలో హాజరు కావాలని తెలిపారు. పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు గంటకు రూ. 150 చొప్పున నెలకు రూ. 10,000 మించకుండా పారితోషికం అందజేస్తామని తెలిపారు. విశ్రాంత ఆచార్యులు, జూనియర్ అధ్యాపకులకు తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు.

ఖాళీల వివరాలు..

బాపట్ల కళాశాలలో హిందీ, పిట్టలవానిపాలెం కళాశాలలో ఎకనామిక్స్, అద్దంకి కళాశాలలో ఇంగ్లిస్, ఫిజిక్స్, బల్లికురవ కళాశాలలో ఫిజిక్స్, మార్టూరు కళాశాలలో జంతు శాస్త్రం, పిట్టలవానిపాలెం కళాశాలలో ఒకేషనల్ కోర్సు సీపీఅండ్ఎం అర్హత ఏజీ బీఎస్సీ ఉండాలని తెలిపారు. ఆయా పోస్టులకు అర్హత కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దేవస్థానం అధ్యక్షునిగా సుబ్బారావు



వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన కార్యవర్గ సభ్యులు



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న కూరపాటి రామకోటేశ్వరరావు

వేటపాలెం: స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో గల రాజ్యలక్ష్మి పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానం నూతన అధ్యక్షుడుగా పొగడదండ వెంకట సుబ్బారావు ఎన్నికయ్యారు. ఆదివారం స్వామి వారి కల్యాణ మండపంలో దేవస్థానం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దేవస్థానం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. ఉపాధ్యక్షులుగా సాయిని లక్ష్మీ నారాయణ, బాణాల ఉమామహేశ్వరరావు, సెక్రటరీగా అందె రవి కుమార్, జాయింట్ సెక్రటరీ అందే శ్రీనివాసరావు, రంగిసెట్టి సాంబశివరావు, కోశాధికారిగా పొగడదండ వెంకట రమణ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో 34 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి నూతన కమిటీతో కలిసి కృషి చేస్తామన్నారు. దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నూతన అధ్యక్షునిగా ఊటుకూరి

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలో వేంచేసి వున్న శ్రీచక్రసహిత శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం, శ్రీవాసవి ఆర్యవైశ్య కళ్యాణ మండపం నూతన అధ్యక్షునిగా ఊటుకూరి రామకోటేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక వాసవి కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అద్దంకి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కూరపాటి రామకోటేశ్వరరావు సత్కరించి అభినందించారు.

విద్యార్థులకు శ్రీకృష్ణ శతక పద్యరచన పోటీలు

చీరాల అర్బన్: శ్రీకృష్ణ శతక పద్య పోటీ నిర్వాహక కమిటీ, చీరాల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నల్ల గాంధీ బొమ్మ సెంటర్‌లోని మహాలక్ష్మమ్మ అమ్మవారి దేవస్థానంలో విద్యార్థులకు శ్రీకృష్ణ శతక పద్యరచన పోటీలను నిర్వహించారు. 4,5 తరగతులు ఒక గ్రూపు, 6,7,8 తరగతులు ఒక గ్రూపుగా విభజించి పోటీలును నిర్వహించారు. పరీక్షలో పది పద్యాలు తప్పులు లేకుండా, చూడకుండా విద్యార్థులు రాశారు. ప్రాచీన భారతీయ సంస్కృతి, వారసత్వాన్ని నేటి విద్యార్థులకు అందించి వారిని ఉత్తమ భావి భారత పౌరులుగా రూపొందించే కార్యక్రమాన్ని చేపట్టారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

1053 మందికి వైద్య పరీక్షలు



మెగా వైద్యశిబిరానికి హాజరైన ప్రజలు



హాజరైన వారికి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చీరాల టౌన్: సమాజ సేవ, ఆధ్యాత్మిక, ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రతి ఒక్కరికీ సేవ చేయడమే శ్రీరామానంద సరస్వతి ట్రస్ట్ లక్ష్యమని ఆశ్రమం మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. ఆదివారం వాడరేవులోని రామానంద సరస్వతి ఆశ్రమంలో నిర్వహించిన ఉచిత మెగా షుగరు వ్యాధి శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రకాశం, బాపట్ల, గుంటూరు జిల్లాలకు చెందిన 1053 మంది ఈ ఉచిత షుగరు వైద్య శిబిరానికి హాజరు కాగా వీరికి డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ లలిత ప్రకాష్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గత ఇరవై రెండేళ్ల నుంచి శ్రీ రామానంద సరస్వతి ట్రస్ట్ ఆధ్వర్యంలో అనేక మెడికల్ క్యాంపులు, పేద మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నామని సురేష్ అన్నారు. విద్యాభివృద్ధికి పూర్తి సహకారం, గ్రామాల అభివృద్ధికి కావాల్సిన అనేక విధాలుగా సహకారం అందిస్తున్నామని తెలిపారు. సమాజాభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ప్రతి నెలా ఉచిత షుగరు వైద్య శిబిరాన్ని నిర్వహించి పేదలకు ఉచితంగా నెలకు సరిపడా మందులు అందిస్తున్నామని ట్రస్ట్ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రస్ట్ ప్రతినిధులు కృష్ణారావు, శంకరరావు, సురేష్, బసవరావు, శ్రీనివాస్, కామేశ్వరరావు, గోపాల్, కుమార్ పాల్గొన్నారు.

29న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

- రాష్ట్ర స్థాయి క్రీడాకారుల ఎంపిక కూడా..

చినగంజాం: జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఈ నెల 29వ తేదీన ఇంకొల్లు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బోగిరెడ్డి స్వామిరెడ్డి, కార్యదర్శి మారుబోయిన వెంకటరెడ్డిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల నుంచి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ (సౌత్ జోన్ అండ్ జూనియర్ విభాగాలు) ఎంపికలు జరుగుతాయని అందుకోసం అండర్ 14,16 విభాగాల్లో బాల, బాలికలు తమ పుట్టిన సర్టిఫికెట్‌లను తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, సచివాలయం నుంచి పొందిన సర్టిఫికెట్, ఆధార్ కార్డు, 2 పాస్ పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకొని రావాలని సూచించారు. అదే విధంగా పోటీల్లో పాల్గొనే అండర్ -18, అండర్ -20, అండర్ -23 యువతీ యువకులు వారి వెంట 10 వ తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు, 2 పాస్ పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని రావాలని సూచించారు. నైపుణ్యం కనబరచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని, పోటీలు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు గోపీచంద్ రెడ్డి 8074992796, 7675026220, కె. మధు (పీడీ) 9949741392లను సంప్రదించాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో బాపట్ల జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపారు.

పిరమిడ్ ఆధ్యాత్మిక ర్యాలీ

పర్చూరు (చినగంజాం): శాఖాహారం రుషులు తినే పవిత్ర ఆహారమని అదే ముక్తి మార్గం అంటూ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ కార్యకర్తలు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. జీవ హింస చేయరాదని అది మహా పాపం అని వారు నినదించారు. ర్యాలీ నిర్వహిస్తూ ప్లకార్డులు పట్టుకొని మాంసాహారం వద్దు, శాఖాహారం ముద్దు అంటూ నినాదాలు చేశారు. శాఖాహారం దివ్యమైన ఆహారం అని అదే ఆరోగ్యానికే మంచిదని.. స్థానిక బొమ్మల సెంటర్ వద్ద ర్యాలీగా తిరిగారు. కూరగాయలు, మాంసానికి మధ్య ఉన్న తేడాని వారు ప్రజలకు వివరించారు. అంతా మాంసాహారాన్ని వీడి శాఖాహారాన్ని భుజించాలని కోరారు. పిరమిడ్ సంస్థ కార్యకర్తలు లగడపాటి గాంధీ, అంజలీదేవి తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

వేటపాలెం: పొట్టిసుబ్బయ్యపాలెం శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం. వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 3,200 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జూదం నిర్వహించినా.. ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జీవనోపాధికి ప్రభుత్వం చేయూత

అద్దంకి రూరల్: సుస్థిరమైన జీవనోపాధి కోసం అవసరమైన ఆర్థిక తోడ్పాటును రుణాల రూపంలో ప్రభుత్వం అందజేస్తున్నట్లు ప్రధాని మోదీ తెలియ జేశారని ఏపీఎం కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన లైవ్ ప్రోగ్రాం లక్‌పతి దీదీ సమ్మేళన్‌ను ప్రదర్శించారు. ఏపీఎం మాట్లాడుతూ సంవత్సరానికి లక్షలోపు ఆదాయం ఉన్నవారిని గుర్తించి వారికి ఆర్థిక తోడ్పాటు, సాంకేతిక సహకారం, శిక్షణ అందించి లక్షకుపైగా ఆదాయం వచ్చేలా చేయాలని ప్రధాని సూచించారని వివరించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వీవోఏలు, పోటెన్షియల్ లక్‌పతి దీదీలను సన్మానించారు. సీఐఎఫ్ స్త్రీనిధి బ్యాంక్ రుణాలకు చెందిన రూ. 86.50 వేల చెక్‌ను అందజేశారు.